క్లుప్తంగా

అర్హులైన పేదలందరికీ 'గృహలక్ష్మి' అందించాలి

సీపీఐ నాయకుడు జంగయ్య



మహిళలతో మాట్లాడుతున్న జంగయ్య

కొందుర్గు: అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన కొందుర్గులో ఇండ్లులేని నిరుపేద మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకానికి మూడు లక్షల రూపాయలు కేటాయిస్తే ఎలా ఇళ్లు నిర్మించుకుంటారన్నారు. ఇక ఇంటి స్థలం లేనివారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం ఈ పథకానికి ఆరు లక్షలు వరకు పెంచాలని, ఇంటి స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

బస్సు సర్వీస్ ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న నవీన్‌కుమార్

కేశంపేట: మండలంలోని కొత్తపేట నుంచి అఫ్జల్‌గంజ్ వరకు నూతన సర్వీస్‌ను ఆర్టీసీ వారు ఏర్పాటు చేశారు. ఈ బస్సును గురువారం గ్రామ సర్పంచ్ నవీన్‌కుమార్ ప్రారంభించారు. ఆర్టీసీ సిబ్బంది ప్రజల మన్ననలను పొందాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేష్‌యాదవ్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, నరేష్‌యాదవ్, జగన్ రెడ్డి, కృష్ణ, లక్ష్మయ్య, కుత్బుద్దీన్, శ్రీను, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా నమో ఆరోగ్యమస్తు

బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి



మందులు పంపిణీ చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కొందుర్గు: గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలకు సరైన వైద్యం అందక అనారోగ్యంతో బాధపడుతున్నారని, వారి ఆరోగ్యం మెరుగుపర్చడం కోసమే నమో ఆరోగ్యమస్తు కార్యక్రమం నిర్వహిస్తున్నామని బీజేపీ నేత పాలమూరి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని లచ్చంపేట, తుమ్మలపల్లి, వనంపల్లి, లాల్‌పహాడ్, తూంపల్లి గ్రామాల్లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మోహన్‌సింగ్‌నాయక్, కురుమయ్య, ప్రదీప్, నవీన్, యాదయ్య, సురేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

శంకర్‌పల్లి: మండలంలోని కొండకల్‌లో గురువారం కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ వస్తున్నందున మండలంలోని బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులను స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మరి కొందరిని హౌజ్ అరెస్టు చేశారు. సీఎం కేసీఆర్ పర్యటన అనంతరం వారిని వదిలేశారు. ముందస్తు అరెస్టు చేసిన వారిలో చేవెళ్ల బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు రాములుగౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బీర్ల సురేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రాములుకు డాక్టరేట్

కొందుర్గు: తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ జర్నలిస్ట్ కొత్తపల్లి రాములుకు ఉస్మానియా యూనివర్సిటీ గురువారం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 'చెరబండ రాజు సాహిత్య అనుశీలనం' అనే అంశంపై రాములు చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. తెలుగు విభాగంలో రాములు చేసిన పరిశోధనకు డాక్టర్ నందినిసిద్ధారెడ్డి పర్యవేక్షకులుగా వ్యవహరించారు. తనకు సహకరించిన గైడ్ నందినిసిద్ధారెడ్డి, తెలుగు విభాగం అధ్యాపకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. డాక్టరేట్‌ను అందుకోవడం పట్ల ఆగిర్యాల గ్రామస్తులు అభినందనలు తెలియచేశారు.

అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ



మొయినాబాద్‌రూరల్: మహనీయులకు నివాళి అర్పిస్తున్న మంజుల, తదితరులు



షాద్‌నగర్: మౌనం పాటిస్తున్న విద్యార్థులు, నాయకులు, ఉపాధ్యాయులు

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు మంజుల

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది సంబరాలు జూన్ 2వ తేదీ నుంచి జూన్ 22వ తేదీ వరకు గ్రామాల్లో ప్రజాప్రతినిధులను, నాయకులను, కార్యకర్తలను, ప్రజలకు దశాబ్ది ఉత్సవాలు ఎంతో ఆనందోత్సవాన్ని నింపాయని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు మంజుల అన్నారు. గురువారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు బహిరంగ సభ నిర్వహించారు. గురువారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు మహనీయులకు నివాళి అర్పించి బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చేపట్టిన ప్రతి కార్యక్రమం ప్రజలను ఎంతో ఆకట్టుకుంటుందని తెలిపారు. 22 రోజులుగా గ్రామాల్లో దశాబ్ది ఉత్సవాలు ప్రజాప్రతినిధులు పండుగగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ మూడవసారి హైట్రిక్ సాధిస్తుందని ఆమె దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, గ్రామ పంచాయతీ కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

కేశంపేట: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో అమరుల త్యాగాలు మరువలేనివని ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో సాగిన ఉద్యమంలో అమరులను గుర్తించి తగిన ప్రోత్సాహకం అందించారు. అనంతరం అమరులకు నివాళి అర్పించారు. ఉద్యమకారులను, అమరుల కుటుంబసభ్యులను బీఆర్‌ఎస్ పార్టీ గుర్తించి తగిన విధంగా ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజీంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ అనురాధ, పీఏసీఎస్ చైర్మన్ గంగ్ర జగదీశ్వర్‌గౌడ్, వివిధ గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



అమరులకు నివాళి అర్పిస్తున్న ఎంపీపీ

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్: అమరుల త్యాగాల ఫలితమే ప్రత్యేక తెలంగాణ అని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బూర్గుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ..అన్ని వర్గాల ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేశారని అన్నారు. ఎంతో మంది యువకులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. త్యాగాల పునాదుల మీద ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని చెప్పారు. అనంతరం అమరవీరులకు నివాళి అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మౌనిక, హరికృష్ణగౌడ్, సర్పంచ్ అరుణ, శివకుమార్, పోచయ్య, సంతోష్‌కుమార్, ప్రభాకర్, చిన్నయ్య, ఎల్లయ్య, హెచ్‌ఎం జయప్రద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అమరవీరుల దినోత్సవం

కొందుర్గు: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కొందుర్గులో అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చెర్కుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు అమరవీరుల వేశాధారణలో పలువురిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగయ్య, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, జడ్పీటీసీ రాగమ్మ, తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంపీడీఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: ఎంతో మంది అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిందని జెడ్పీవైస్ చైర్మన్ గణేష్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన నందిగామలో గురువారం అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్ హాజరై అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం ఎందరో మహనుభావులు ప్రాణాలు త్యాగం చేయడం ఈ సమాజం ఎప్పటికీ మరవదని గుర్తుచేశారు. వారి ఆత్మ బలిదానాల ఫలితంతోనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రియాంకగౌడ్, తహసీల్దార్ రహ్మాన్ ఖాన్, ఎంపీడీఓ బాల్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు లత, ఎంపీటీసీ కృష్ణ, హెచ్‌ఎం దినేష్, కోఆప్షన్ సభ్యుడు బేగ్ పాల్గొన్నారు.

ఘనంగా దశాబ్ది ఉత్సవాల ముగింపు

మొయినాబాద్‌రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తోల్‌కట్ట సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో దశాబ్ది సంబరాల ముగింపును నృత్యాలతో ముగించారు. గురువారం మండలంలోని తోల్‌కట్ట సమీపంలో గల సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల పాఠశాల, కళాశాల, వికారాబాద్ డిగ్రీ కళాశాలలో దశాబ్ది ముగింపు కార్యక్రమంలో భాగంగా అమరవీరులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, వికారాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌శర్మ, ఎత్‌మార్‌పల్లి సర్పంచ్ నవనీతారాజులు పాల్గొని అమరవీరులకు జ్యోతి ప్రజ్వలన చేసి పూలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వారు మాట్లాడుతూ .. రాష్ట్రంలో ఎక్కడ చూసిన జూన్ 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు దశాబ్ది ఉత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల, పాఠశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొందుర్గు: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ జంగయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరగనుందని ఎంపీడీఓ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. మండల స్థాయిలో గల అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి రావాలని సూచించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ ఏఈ బానోతు హమునాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా అజీజ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని అజీజ్‌నగర్, పద్మావతి కాలనీ, ఎనికేపల్లి గ్రామాల్లో ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, మొయినాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని హిమాయత్‌నగర్, చిలుకూరు, జేబీఐటీ, సురభికాలనీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

తొలకరి పలకరింపు

మొయినాబాద్: తొలకరి వానలు పలకరించాయి. వర్షాకాలం మొదలై పదిహేను రోజులు దాటినా ఇప్పుడే తొలకరి వర్షాలు మొదలయ్యాయి. తొలకరి వర్షాల కోసం రైతులు ఎదురు చేస్తున్నారు. గురువారం మొయినాబాద్ మండల కేంద్రంతో పాటు సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్, కనకమామిడి, తోలుకట్ట, పెద్దమంగళారం తదితర గ్రామాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యారు.

కంటివెలుగుతో దృష్టి సమస్యలు దూరం

మున్సిపల్ ఛైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ లావణ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో గురువారం ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. అంధత్వ రహిత సమాజం కోసం ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. శిబిరాల్లో పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు ఇస్తున్నట్లు వివరించారు. సమస్యలు తీవ్రంగా ఉన్న వారిని గుర్తించి పలు ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పురపాలిక కమిషనర్ వీరేందర్, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్ వీరమోని హేమదేవేందర్ ముదిరాజ్, కౌన్సిలర్లు, నాయకులు యాదయ్య, దేవేందర్, శ్రీనివాస్, రాఘవేందర్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న లావణ్య, తదితరులు

కంటివెలుగుతో ప్రయోజనం

శంకర్‌పల్లి: కంటివెలుగు కార్యక్రమం పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని కౌన్సిలర్ జూలకంటి శ్వేత పేర్కొన్నారు. గురువారం 14వ వార్డులో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కంటి సమస్యలను దూరం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో పౌరసరఫరాల కేంద్రాలు

జెడ్పీటీసీ మాలతి

చేవెళ్ల: ప్రజలకు అందుబాటులో పౌరసరఫరాల కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీటీసీ మర్పల్లి మాలతి అన్నారు. మండలకేంద్రంలో ఉన్న మూడు రేషన్ దుకాణాల్లో రెండు దుకాణాలు ఒకే చోట ఉండడంతో ఒక దానిని దూరంగా ఉన్న కాలనీలకు మార్చాలని అధికారులు నిర్ణయించారు. గురువారం రెవెన్యూ అధికారులతో మాట్లాడి రేషన్ దుకాణాన్ని మరోక చోటుకు మార్చి ప్రారంభించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అందించే రేషన్ సరుకులు వారి కాలనీలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేవెళ్ల పట్టణం విస్తారిస్తుండడంతో పలు కాలనీలు గ్రామానికి దూరంగా ఉన్నాయన్నారు. మండలకేంద్రంలోని రంగారెడ్డి, సీపీఐ, హౌసింగ్‌బోర్డు కాలనీ, చంద్రారెడ్డినగర్, బాలాజీనగర్, గణేశ్ నగర్‌కాలనీల ప్రజలు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు రేషన్ దుకాణాన్ని మా కాలనీలకు అందుబాటులో ఏర్పాటు చేయాలని విన్నవించారని అన్నారు. విషయం తమ దృష్టికి రావడంతో రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు ఆమె తెలిపారు. ఆర్ఐ రాజేష్ మాట్లాడుతూ.. రేషన్ దుకాణం లైసెన్స్‌ను కొత్త కాలనీకి మార్చుకోవాలని డీలర్‌కు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి, దామరగిద్ద సర్పంచ్ వెంకటేశంగుప్తా, సర్పంచ్ నరహరిరెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు పి. ప్రభాకర్, నాయకులు ఎం. జంగయ్య, ఎల్లయ్య, దయాకర్, ఖలీల్, రమేశ్, సాయి, వెంకటేశ్ ఉన్నారు.



రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కేజీబీవీలో సమస్యల తిష్ట



హాస్టల్ నుంచి వెళ్తున్న విద్యార్థినులు

- టీసీలు తీసుకొని వెళ్తున్న విద్యార్థినులు
- నిబంధనల పేరుతో లోపలికి అనుమతి నిరాకరణ
- ఎంఎస్‌పీ నాయకుడు శ్రావణ్‌కుమార్

కొత్తూరు: మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల హాస్టల్ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని ఎంఎస్‌పీ సీనియర్ నాయకుడు శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. గురువారం ఆయన పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులతో కలిసి హాస్టల్ వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. హాస్టల్‌లో మరుగుదొడ్లు శుభ్రంగా అపరిశుభ్రంగా ఉన్నాయని.. పడుకునే గదుల్లోకి ఎలుకలు, కప్పలు వస్తున్నాయని విద్యార్థినుల తల్లిదండ్రులు తన దృష్టికి తేవడంతో హాస్టల్ వద్దకు వెళ్లినట్లు పేర్కొన్నారు. హాస్టల్ అధికారులు తనను నిబంధనల పేరుతో లోపలికి అనుమతించలేదన్నారు. హాస్టల్‌లో సరైన సౌకర్యాలు, వసతులు లేక పలువురు విద్యార్థినులు ఇతర హాస్టళ్లకు వెళ్తున్నారని చెప్పారు. మరుగుదొడ్ల నుంచి దుర్వాసన రావడంతో పాటు నిర్వహణ సక్రమంగా లేదన్నారు. నాణ్యత లేని భోజనాన్ని వడ్డిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను తాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ఈ విషయమై హాస్టల్ ప్రత్యేకాధికారి ప్రియాంకను వివరణ కోరగా సిబ్బంది కొరత కారణంగా మరుగుదొడ్ల నిర్వహణ కష్టతరంగా మారిందన్నారు. రోజుకు ఒకసారి మాత్రమే శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. అన్నం నాణ్యతగా లేకపోతే వెంటనే మళ్లీ వండి వడ్డిస్తున్నట్లు చెప్పారు.

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఉన్న శ్రీ అభయాంజనేయబస్వామి దేవాలయం ప్రహరీ నిర్మాణ పనులకు గురువారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. భక్తితోనే ముక్తి లభిస్తుందని చెప్పారు. దేవాలయ అభివృద్ధికి అందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం లక్షరూపాయల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మల్లేశ్, రాజేందర్, కృష్ణారెడ్డి, మనోహర్‌రెడ్డి, రాందాస్, రాజుచారి, శ్రీను, శంకరయ్య, యాదయ్య, హరి, రవి, రమేశ్, సురేష్ పాల్గొన్నారు.



ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

దశాబ్ది ఉత్సవాల పేరుతో దగా



చేవెళ్ల: పది తలల కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



నందిగామ: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



కొందుర్గు: దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ దశాబ్ది ఉత్సవాలు అంటూ దగా చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గం నాయకులు సున్నపు వసంతం, షాబాద్ దర్శన్, పామెన భీంభరత్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్‌లు అన్నారు. మండలకేంద్రంలో గురువారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గం నాయకులు సున్నపు వసంతం ఆధ్వర్యంలో దశాబ్ది దగా పేరుతో నియోజకవర్గ కేంద్రంలో ధర్నా నిర్వహించి పది తలల కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికలు వస్తున్నాయంటే ఈ ప్రభుత్వానికి ప్రజలు గుర్తుకు వస్తారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటివరకు నెరవేర్చలేదు.. కానీ, ఇప్పుడు మళ్లీ కొత్త హామీలు ఇస్తూ ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గొప్పలు చెప్పుకోవటానికి కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఉత్సవాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. పేదలకు మేలు చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ప్రజలకు అర్థమయిందన్నారు. ధర్నాలో టీపీసీసీ నాయకులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఉదయ్‌మోహన్‌రెడ్డి, డీసీసీ నాయకులు ఆగిరెడ్డి, మధుసూదన్‌గుప్తా, పెంటయ్యగౌడ్, మహేశ్వర్‌రెడ్డి, రాములు, పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, పెంటారెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీను కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

కొందుర్గు: మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తికాకుండానే బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల కోసం ప్రజాధనాన్ని ఖర్చుచేసి దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. తొమ్మిదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రానికి ఒరగబెట్టిందేమిలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, గోవర్ధన్ గౌడ్, రాజు, మల్లయ్య, మహిపాల్ రెడ్డి, యాదయ్య, శ్రీనివాసు రెడ్డి పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: తొమ్మిది ఏళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి చేసింది శూన్యమేనని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ విమర్శించారు. గురువారం పీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రమైన నందిగామలోని పాత జాతీయ రహదారిపై సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా నర్సింహయాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో ఏం ఘన కార్యం చేసిందని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ఎంపీటీసీలు కుమార్ గౌడ్, చంద్రపాల్ రెడ్డి, నాయకులు రాములు, వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

కేశంపేట: బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్గనమోని గిరియాదవ్ అన్నారు. గురువారం గిరియాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు దశాబ్ది దగ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సీఎం దిష్టిబొమ్మను ర్యాలీ నిర్వహించి దహనం చేశారు. గిరియాదవ్ మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మళ్లీ మోసం చేసేందుకే దశాబ్ది ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించిందని ఆయన ఆరోపించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల మహిళ సంఘం అధ్యక్షురాలు అనసూయ, రమేష్, పర్వతాలు, రూప్లానాయక్, పెంటయ్య, భాస్కర్‌గౌడ్, భాస్కర్, విజయరెడ్డి, పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

షాద్‌నగర్: ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని పీసీసీ సభ్యులు వేణుగౌడ్ అన్నారు. పీసీసీ పిలుపు మేరకు దశాబ్ది దగా కార్యక్రమాన్ని షాద్‌నగర్ ముఖ్యకూడలిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. గతంలో ఇచ్చిన హామీలను బీఆర్‌ఎస్ తుంగలో తొక్కి మళ్లీ కొత్త హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. అనంతరం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్యయాదవ్, బాబర్‌ఖాన్, బాలరాజ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కొందురులో..

కొందుర్గు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో దగా చేస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ విమర్శించారు. అంతకు ముందు చౌదరిగూడలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం తహశీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సందర్భంగా శంకర్ మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా మరిచిపోయిందన్నారు. కేజీ టూ పీజీ ఉచిత విద్య, ఫీజు రియింబర్స్ మెంట్, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, రైతు రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూ పంపిణీ ఏమయ్యాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, నాయకులు పాల్గొన్నారు.